క్లుప్తంగా

రేపు సెబ్ కార్యాలయంలో వాహనాల వేలం

చినగంజాం (పర్చూరు): ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు పర్చూరులోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్లో ద్విచక్రవాహనాల వేలం పాట జరుగుతుందని సెబ్ సీఐ ఎమ్ భుజంగరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, నెల్లూరు ఆదేశాల మేరకు బాపట్ల సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మద్యాన్ని తరలిస్తుండగా సీజ్ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం అవ్వాలి


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

సంతమాగులూరు (అద్దంకి): ఖరీఫ్ సీజను ప్రారంభమైనందున గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్ధంగా ఉండాలని మార్టూరు ఏడీఏ శ్రీనివాస్ అన్నారు ఆయన మంగళవారం మండలంలోని ఏల్చూరు టూ ఆర్‌బీకేలో నిర్వహించిన ఖరీఫ్ సాగుకు సమాయత్తం వ్యవసాయ క్షేత్ర సహాయకులు, అధీకృత డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం దుకాణాల్లో కొనుగోలు చేసిన సమయంలో వారికి డీలర్లు కొనుగోలు చేసిన విత్తనాలకు తగిన రసీదు ఇవ్వాలని చెప్పారు. అందులో లాటు నంబరు, విత్తనం రకం, మొలక శాతం తదితర వివరాలు బస్తాపై ముద్రించి ఉండాలన్నారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పకుండా అడిగి తీసుకోవాలన్నారు. ఏదైనా తేడా జరిగిన సమయంలో ఆయా కంపెనీల నుంచి నష్టపరిహారం పొందాలంటే తగు రసీదు, విత్తన బస్తాలు భద్రపరుచుకుని ఉండాలని చెప్పారు. అదే విధంగా డీలర్లు లైసెన్స్ పొందిన విత్తన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి లావణ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దుకాణ డీలర్లు, గ్రామ వ్యవసాహయ సహాయకులు పాల్గొన్నారు.


నకిలీ విత్తనాలు వలన పంగులూరు గ్రామంలో మిర్చి పంటకు కాపు లేక పంట పీకేస్తున్న రైతులు (ఫైల్)


కొండమంజులూరు గ్రామంలో ఎదుగుదల లేని మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నకిలీ విత్తనాలు

- నకిలీ విత్తనాలతో రైతుల ఇబ్బందులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీలు

జే.పంగులూరు: విత్తనం బాగుంటే పంట బాగుంటుందనేది రైతుల అపార నమ్మకం. ఈనమ్మకాన్ని కొన్ని విత్తన కంపెనీలు అలుసుగా తీసకొని వారి జీవితంతో ఆడుకుంటున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చింది. రైతులను అకర్షించే విధంగా కొత్త కొత్త పురుగు మందు, విత్తనాల కంపెనీలు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. ఈ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేసే రైతన్నలు ముందుగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో అనుమతులు లేని కంపెనీల విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులు ఎక్కువ శాతం మిర్చి, పత్తి, కురగాయల విత్తనాలు మార్టూరు, చిలకలూరిపేట, నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేస్తారు. ఇత్తనాల దుకాణాలు అధికారులు ఆకస్మిక తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. విత్తనాలు కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు


దుకాణాల్లో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు


ముప్పవరంలో నకిలీ ఎరవులు, పురుగు మందులను పట్టుకున్న అధికారులు (ఫైల్)

సూచిస్తున్నారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఒకటికి రెండు సార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించి విత్తనాలు కొనుగోలు చేయాలి.
- లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారుల నుంచి కొనుగోలు చేయకూడదు.
- సరుకు లాట్ నంబర్, తయారీ తేది, రకం, ఇలా అన్ని వివరాలు కలిగి ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారులు నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంచులు సీలు విప్పినట్లు లేదా విప్పి తిరిగి కుట్టు వేసిన వాటిని కొనరాదు.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు నుంచి మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలి.
- విత్తన బస్తాతో లభించే ట్యాగ్ ఉందో లేదో గమనించి తీసుకోవాలి. ఆ ట్యాంగ్ ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి.
- పురుగు మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారు తేది, కాలపరిమితి గడువు గమనించి అందుకు అనుగుణంగా బిల్లుతీసుకోవాలి.
- ఏది ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణాదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవి అని అనుమానం వస్తే వ్యవసాయశాఖ అధికారును సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.

> **అనుమతులు లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు..**
>
> ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దు. బ్యాచ్ నంబరు లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. విత్తనాలు, ఎరువుల కొనుగోలులో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన దుకాణం నుంచి బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లును పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలి. ప్రైవేటు వ్యక్తులు దగ్గర విత్తనాలు కొనుగోలు చేయరారు.
>
> – సుబ్బారెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి

- లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- నకలీలని తేలితే విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ, దుకాణాదారునిపై వెంటనే కేసు నమొదు చేస్తారు.
- విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత అధీకృత డీలర్ నుంచి బిల్లుపై (రశీదు) సంతకం తీసుకోవాలి.
- హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించి కొనుగోలు చేయాలి.
- విత్తనాన్ని దుకాణదారుడి నుంచి కొనుగోలు చేసిన తర్వాత ఇంటివద్దనే విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకున్న తర్వాత సంతృప్తికరంగా ఉంటేనే పొలంలో విత్తుకోవాలి.
- విత్తనంలో గల లోపాన్ని వివరించిన తరువాత కూడా దుకాణదారుడు సరైన విధంగా విత్తనాన్ని మార్చి ఇవ్వకపోతే సదరు డీలర్‌పై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధంగా చేస్తే విత్తన పరిహారం పొందే హక్కు రైతులకు ఉంటుంది.

ఉప్పుటూరులో ఆగిపోయిన వాటర్ ప్లాంట్


పని చేయకుండా ఉన్న వాటర్ ప్లాంట్

చినగంజాం (పర్చూరు): ఉప్పుటూరులోని వాటర్ ప్లాంట్ ఆగిపోయింది. వేసవి పూర్తిగా వెళ్లక ముందే ప్లాంట్ ఆగిపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫిల్టర్లు, ఇతర పరికరాలు పనిచేయక పోవడంతో గత వారం రోజుల నుంచి ప్లాంట్ పనిచేయడం లేదు. నీటి కోసం ఎండలో సమీప గ్రామాలకు వెళ్లలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. పర్చూరు, నాగులపాలెం గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లు పనిచేయక గత రెండు రోజుల నుంచి నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉండటంతో ఉప్పుటూరు ప్రజలకు నీటి కష్టాలు తప్పేటట్లు లేవు. గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను బాగు చేయాలంటే కనీసం రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు వాటర్ ప్లాంట్ ని హస్తగతం చేసుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో గ్రామంలో వాటర్ ప్లాంట్ ఎవరి ఆధీనంలో ఉండాలో సందిగ్ధత నెలకొంది. దీనిని బాగుచేయటానికి మరింత సమయం పట్టే సూచనలు కనబడుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు కూడా దీనిపై సరియైన నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. దీంతో గ్రామస్తులకు కొంతకాలం తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేదు. ఉన్నత అధికారులు వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

కరుణించు.. స్వర్ణమ్మ తల్లీ


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి

స్వర్ణ (కారంచేడు): కరుణించి, కాపాడు తల్లీ మాస్వర్ణమ్మతల్లీ అంటూ భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి 31వ తిరునాళ్లను పురస్కరించుకొని రెండో రోజున అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఏడాది కాలం అంతా పంటలు బాగా పండాలని, అన్నదాతలు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, గ్రామంపై ఎలాంటి ఉపద్రవాలు లేకుండా కాపాడాలని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఘటముల కుండలతో, మాతంగి తప్పెట్లతో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీతో పాటు, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హైస్కూల్‌కు బస్ కేటాయింపు


చందలూరు హైస్కూల్‌కు కేటాయించి ఆర్టీసీ బస్సు

జే.పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం, అద్దంకి ఆర్టీసీ డిపో అధికారులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆర్టీసి బస్సు కేటాయించారు. గత నాలుగైదు సంవత్సరాలుగా అద్దంకి డిపో నుంచి పాఠశాలకు ఒక బస్సును కేటాయించారు. ఈపాఠశాలకు మండలంలోని సుమారు ఆరు గ్రామాల నుంచి విద్యార్థులు హాజరవుతారు. ఈవిద్యార్థులను పాఠశాలకు సకాలంలో చేర్చేందుకుగాను ఆర్టీసీ అధికారులు ఈ బస్సును కేటాయించారు. తమ పాఠశాల విద్యార్థుల సౌకార్యార్థం బస్సు కేటాయించిన అధికారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజ, పాఠశాల సిబ్బంది మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్లు నూరు శాతం పూర్తిచేయాలి


రిజిస్ట్రేషన్లు పరిశీలించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: అర్హులైన దంపతులు, గర్భిణీలు, చిన్నారుల రిజిస్ట్రేషన్ గ్రామాల వారీగా నూరుశాతం పూర్తిచెయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. మంగళవారం కొప్పరపాలెం గ్రామంలో 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏఎన్ఎం, ఆశవర్కర్లతో మాట్లాడారు. 3వ నెల నుంచే గర్భిణుల రిజిస్ట్రేషన్లు పూర్తయితే అన్ని రకాల ఇంజక్షన్‌లు, రక్త పరీక్షలు, రక్తహీనత లేకుండా తగుజాగ్రత్తలు వహించాలన్నారు. తద్వార పుట్టబోయో బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటాడన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.


వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


సముద్రపు అలలకు సేదతీరుతున్న కుటుంబం

ఓడరేవుకు పోటెత్తారు..


వాడరేవులో పర్యాటకులకు సూచనలందిస్తున్న రూరల్ పోలీసు సిబ్బంది

- సముద్రతీరానికి వేలాదిగా ముస్లింలు
- తీరంలో సందడే సందడి

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం మంగళవారం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ముస్లింలకు రెండో అతిపెద్ద పండుగైన బక్రీద్ పండుగ అనంతరం ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానాలు ఆచరిస్తుంటారు. దీంతో ఓడరేవుకు పోటెత్తగా తీరం అంతా కోలాహలంగా మారింది. ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతు సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు ఇసుకతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల వాడరేవు తీరానికి పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి, ప్రత్తిపాడు, గుంటూరు ప్రాంతాలకు చెందిన ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది. సముద్ర తీరానికి అధికంగా ముస్లింలు వస్తుండటంతో రూరల్ ఎస్సై శివకుమార్, మెరైన్ పోలీసులు, ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. వాచ్ టవర్, ఏటీవీ వాహనం, మైక్ అనౌన్స్‌లు చేపట్టారు. వాడరేవులో ట్రాఫిక్ సమస్య లేకుండా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.

ముగిసిన వేసవి తైక్వాండో శిక్షణా శిబిరం


సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులు

చీరాల రూరల్: చీరాల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో మాస్టర్ ఎస్‌డీ సలావుద్దీన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వేసవి తైక్వాండో శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ సలావుద్దీన్ మాట్లాడారు. ఉచిత శిక్షణ శిబిరం మే 1 తేదిన ప్రారంభించామని జూన్ 1 వరకు ముగించాల్సి ఉండగా ఎన్నికల నిబంధల వలన పొడిగించాల్సి వచ్చిందని చెప్పారు. వేసవిలో విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా ఉచిత శిక్షణ శిబిరంలో చేరి తైక్వాండో నేర్చుకోవం మంచి పరిణామమని చెప్పారు. అందుకు తగ్గట్లుగా విద్యార్థులను శిక్షణ శిబిరాలకు తీసుకువచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తైక్వాండో ఒక మార్షల్ ఆర్ట్స్ క్రీడని దానిని నేర్చుకోవడం వలన శరీరం దృఢత్వంగా ఉండడమే కాకుండా మానసికంగా మంచి పరిణితి చెందుతారని చెప్పారు. ముఖ్యంగా తైక్వాండో విద్యార్థినిలకు, మహిళలకు వారి ఆత్మరక్షణ కోసం చక్కగా ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు తైక్వాండో పాటు ఫిట్‌నెస్ ప్రాక్టీస్, రన్నింగ్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి వాటితో పాటు ఆహార నియమాలు పాటించడం, తాగునీరు, మెడిటేషన్ నేర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోచ్ పి. ప్రశాంత్‌బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

అద్దంకి రూరల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నేను బడికిపోతా కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జులై 11వ తేదిలోపు మండలంలో డ్రాపౌట్స్ విద్యార్థులను, బడి వయస్సు కలిగి ఇంకా బడిలో చేరని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. 12 వతేదిన అన్ని హేబిటేషన్స్‌లో బడి వయస్సు గల పిల్లలందరూ బడిలో ఉన్నారనే సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, సీఆరిపీలు బడిలోలేని బాలకార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఈవో గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, డిజిటల్ విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు లతో ఒత్తిడిలేని విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 సుధాకర రావు, సీడీపీవో కృష్ణకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్స్, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

8750 మంది రైతులకు పీఎం కిసాన్

బల్లికురవ: మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో అర్హులైన 8750 మంది రైతులకు పీఎం కిసాన్ 17వ విడత ఒక్కొరికి రెండు వేల చొప్పన పెట్టబడి సాయం కింద రైతుల ఖాతాలకు జమ అవుతున్నట్లు వ్యవసాయాధికారిణి ఎస్వీపి కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి మూడు విడతల్లో రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. యూపీ పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోద బటన్ నొక్కారని రెండు రోజుల్లోపు ఖాతాలకు జమ అవుతాయని చెప్పారు. ఆర్‌బీకేల వారీగా వీఏఏలు భూసార పరీక్షలు చేస్తున్నారని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేత్రపర్వంగా శ్రీగిరి బ్రహ్మోత్సవాలు


హనుమంత వాహానం పై దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి

ఒంగోలు మెట్రో: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు అన్ని యుగాల దేవుడని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత ఒంగోలు నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ అన్నారు. ఒంగోలు కొండపై శ్రీగిరి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటైన కార్యక్రమంలో డాక్టర్ రమేష్ కృష్ణ వేంకటేశ్వర వైభవం అనే అంశం పై ప్రసంగించారు. అష్టాదశ పురాణాలతో పాటు పలు గ్రంథాల్లోని భగవంతుని ఉనికి గురించి సాధికారిక విశేషాలను రమేష్ కృష్ణ చక్కగా వివరించారు. వెంకటాద్రితో సమానమైన కొండ గాని వేంకటేశ్వర స్వామితో సమానమైన దైవం గానీ లేరని రమేష్ కృష్ణ తెలిపారు. పాపాలను నశింప చేసి మోక్షాన్ని ప్రసాదించే దైవం వేంకటేశ్వరుడని వెల్లడించారు. డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారితో పాటు ఆలూరు జైశంకర్ ఘనంగా సత్కరించారు.శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజలు, ప్రాకారోత్సవం, చూర్ణోత్సవం , విశేష స్నపన తిరుమంజనం, చక్రస్నానం, ధ్వజారోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమంత వాహనం పై కొలువుదీరిన శ్రీదేవీ ,భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం , అనూరాధ నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.